క్లుప్తంగా

12న సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో కళాసాధ ఆధ్వర్యంలో ఈనెల 12న సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు బి.వేదయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వేదనాదం పుస్తకావిష్కరణ అనంతరం సూపర్‌స్టార్ కృష్ణ నటించిన చిత్రాల్లోని పాటలతో సంగీత విభావరి జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంగీత అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో మస్తాన్‌షా ఉరుసు మహోత్సవాలు



పాత గుంటూరు: గుంటూరు జీటీ రోడ్డులోని హజరత్ కాలేమస్తాన్‌షా అవులియా ఉరుసు మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దర్గా ధర్మకర్త రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో బుధవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన గంధం మహోత్సవం నగర ప్రధాన వీధుల్లో కొనసాగుతూ గురువారం ఉదయం 10 గంటల వరకు ఘనంగా నిర్వహించారు. విశేష సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు. బాబా దర్శనానికి వస్తున్న భక్తుల సౌకర్యార్థం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మధ్యాహ్నం, సాయంత్రం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 4 గంటలకు గంధ పంపిణీ, దీపారాధన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగర ప్రముఖులు, భక్తులు విశేష సంఖ్యలో బాబా సమాధిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

హోంగార్డుల చేయూత అభినందనీయం



నగరంపాలెం: ఉద్యోగ విరమణ చేసిన మహిళా హోంగార్డుకి సహచర హోంగార్డులు ఆర్థికంగా చేయూతనివ్వడం అభినందనీయమని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. గతేడాది సెప్టెంబర్ 9న ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు జి.కనకదుర్గకు హోంగార్డుల ఒక రోజు వేతనం రూ.2.32 లక్షల చెక్కుని గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అందించారు. కార్యక్రమంలో ఆర్ఐ రమేష్‌కృష్ణన్, ఎన్సీట శ్రీనివాస్, సుధీర్ పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దారుఢ్యం



గుంటూరు ఎడ్యుకేషన్: క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసికంగా దృఢంగా ఉండగలరని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా తెలిపారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో గురువారం ఏఎన్‌యూ అంతర్ కళాశాలల పవర్ లిఫ్టింగ్ పోటీల్ని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని సూచించారు. మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహద పడతాయని, విద్యార్థినులు క్రీడల్లో తప్పనిసరిగా ప్రావీణ్యం సంపాదించాలని ఆయన సూచించారు. పవర్ లిఫ్టింగ్ క్రీడలో పురుషులతో పాటు మహిళలు సైతం పాల్గొని సాధన చేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర వీఆర్ జ్యోత్స్నకుమారి, క్రీడా శిక్షకులు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఇంట్లో చోరీపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పసుమర్తి కాలనీలో నివసించే నూకల మురళీకృష్ణ సోమవారం కుటుంబంతో ఊరు వెళ్లి, గురువారం వచ్చారు. అయితే, ఇంటి తాళాలు వేసే ఉన్నాయి.లోపలకు వెళ్లి బీరువా పరిశీలించగా కొంత నగదు, బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీ సొత్తు ఎంత అనేది నిర్ధారణ కాలేదని పోలీసులు తెలిపారు.

బాలిక అదృశ్యం

గుంటూరు ఈస్ట్: బాలిక అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. రాజీవ్ గాంధీనగర్‌లో నివసించే ఓ కుటుంబానికి చెందిన 13 సంవత్సరాల బాలిక బుధవారం ఇంట్లో చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయాలి

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్



గృహ సారథులకు కిట్లను అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ ఎమ్మెల్యే ముస్తఫా, నియోజకవర్గ పరిశీలకుడు అడపా శేషబాబు

నెహ్రూనగర్: ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని ప్రజలకు చేరువయ్యేలా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పనిచేయాలని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ తెలియజేశారు. తూర్పు నియోజకవర్గంలోని వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. దేశంలో ఎక్కడా అమలు చేయని విధంగా ప్రజల్లో ఆర్థిక అసమానతలు తొలగించేందుకు సంక్షేమ పథకాలు దోహదపడుతున్నాయన్నారు. పథకాలపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని, వాటిని తిప్పికొట్టే విధంగా కన్వీనర్లు, గృహ సారథులు పని చేయాలని ఆయన సూచించారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్, తూర్పు నియోజకవర్గ పరిశీలకుడు అడపా శేషబాబు మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలు అభివృద్ధి చెందడానికి, వారు సామాజికంగా, ఆర్థికంగా ఎదగడానికి సీఎం వైఎస్ జగన్ తీసుకుంటున్న నిర్ణయాలు చారిత్రాత్మకమైనవని తెలిపారు. తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ రానున్న కాలంలో వైఎస్సార్ సీపీ చిరస్థాయిగా ప్రజల గుండెల్లో ఉండాలనే లక్ష్యంతో కన్వీనర్లు, గృహ సారథులు పని చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ డైమండ్ బాబు, కార్పొరేటర్లు సంకూరి శ్రీనివాసరావు, ఆబిద్‌బాషా, వేముల జ్యోతి పద్మజ, ఖాజా మొహిద్దీన్ చిష్టి, యాట్ల రవి, షేక్ మీరావలి, అంబేడ్కర్, పఠాన్ రిహానా, మల్లవరపు రమ్య, వైఎస్సార్ సీపీ నాయకులు నూరి ఫాతిమా, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు చిలకా రమేష్, గుదే నాగేశ్వరరావు, బుజ్జి పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు



సమీక్షలో మాట్లాడుతున్న ఎం.అల్సన్, శ్రీనివాసబాబు, అధికారులు

గుంటూరు ఈస్ట్: విద్యుత్ శాఖ డీ–1 సెక్షన్ పరిధిలోని బ్రాడీపేట, అరండల్‌పేట ప్రాంతాల్లో విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం పర్యవేక్ష ఇంజినీర్ ఎం.అల్సన్, నగర ఈఈ శ్రీనివాసబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.విజయకృష్ణ నేతృత్వంలో సిబ్బంది విస్తృత తనిఖీలు నిర్వహించారు. 59 మంది అధికారులు, 177 మంది సిబ్బంది, 59 బృందాలుగా ఏర్పడి, 4,692 సర్వీసుల్ని తనిఖీ చేశారు. అనుమతి లేకుండా నేరుగా చౌర్యానికి పాల్పడుతున్న 139 మందికి రూ. 9.65 లక్షల అపరాధ రుసుం విధించారు. అనుమతించిన కేటగిరి కాకుండా, ఇతర కేటగిరిల్లో విద్యుత్ వినియోగిస్తున్న ఐదుగురిపై రూ. 1.10 లక్షలు, అనుమతి లోడుకంటే అదనంగా విద్యుత్ వినియోగిస్తున్న 134 మందికి రూ. 8.55 లక్షలు అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా శ్రీనివాసబాబు మాట్లాడుతూ విద్యుత్ సర్వీసుల తనిఖీలు భారత్ విద్యుత్ చట్టానికి లోబడి ఉంటాయని తెలిపారు. వినియోగదారులంతా విద్యుత్ మీటర్లకు తప్పనిసరిగా సీలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. సీలు లేకపోయినా, తుప్పు పట్టినా వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి రాతపూర్వకంగా తెలియజేయాలని చెప్పారు. పని చేయని మీటరు నుంచి విద్యుత్ వాడుతున్నా, ఉండాల్సిన దాని బదులు వేరే మీటరు పెట్టి సీలు లేకుండా ఉంటే చౌర్యంగా నిర్ధారిస్తామని పేర్కొన్నారు. మొదటి తప్పిదానికి కాంపౌండ్ పద్ధతిలో, రెండో తప్పిదానికి అరెస్టు చేస్తామని చెప్పారు. విద్యుత్ చౌర్యంపై సెల్ 9440812361కు వాట్సాప్ సమాచారం కూడా ఇవ్వవచ్చని తెలిపారు. దాడుల్లో విద్యుత్ అధికారులు ఎం.రవి కుమార్, కె.రవికుమార్, ఎం.ముస్తాక్ అహ్మద్, కె.కోటేశ్వరరావు, కె.అంజినీరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాస్థాయి స్పెల్‌బీ పోటీలకు స్పందన



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో మోహన సాయి కృష్ణ, కృష్ణప్రసాద్, రథినీ చౌదరి

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూలులో గురువారం జిల్లాస్థాయి స్పెల్‌బీ పోటీల్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాయపాటి మోహనసాయికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు సరళమైన ఇంగ్ల పదాల నుంచి కఠిన పదాలను నేర్చుకుని భాషను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అంతర్జాతీయ భాష అయిన ఆంగ్లంలో పట్టు సాధించేందుకు ఇటువంటి పోటీలు దోహదం చేస్తాయని తెలిపారు. స్పెల్‌బీ పోటీలకు ఆర్వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ సుజాత, జేకేసీ కళాశాల ఆంగ్ల అధ్యాపకురాలు పి.నాగ సుశీల న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. జిల్లావ్యాప్తంగా 29 పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థుల బృందాలకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి, అందులో ఆరు జట్లను ఫైనల్స్‌కు ఎంపిక చేశారు. ఫైనల్స్‌కు చేరిన బృందాల్లో డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్, వీవా ది స్కూల్, శ్రీవేంకటేశ్వర బాలకుటీర్, సెయింట్ జోసఫ్ స్కూల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, కన్న స్కూల్ జట్లు మూడు రౌండ్లలో పోటీ పడ్డారు. కాగా పోటీల్లో తొలి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచిన కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్, వీవా ది స్కూల్, శ్రీవేంకటేశ్వర బాలకుటీర్ జట్లు నగదు బహుమతులు గెలుపొందాయి.

డాక్టర్ డానియేల్‌కు ప్రథమ బహుమతి



డాక్టర్ హరివాక్ష్‌చోప్రా నుంచి బహుమతి అందుకుంటున్న డాక్టర్ డానియేల్ ఫిన్ని

గుంటూరు మెడికల్: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ప్రివెంటివ్ అండ్ సోషల్ మెడిసిన్ 50వ వార్షిక సదస్సు హైదరాబాద్ తార్నాకలోని ఎయిమ్స్‌లో ఈనెల 2 నుంచి 4 వరకు నిర్వహించారు. ఈ సదస్సులో నేషనల్ లోగో ప్రజంటేషన్ పోటీల్లో గుంటూరు జిల్లా చినకోండ్రుపాడు కాటూరి మెడికల్ కళాశాలకు చెందిన కమ్యూనిటీ మెడిసిన్ ప్రథమ సంవత్సరం విద్యార్థి డాక్టర్ సంకూరు డానియేల్ ఫిన్ని ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. స్వచ్ఛ భారత్ టీమ్‌పై పోటీలు నిర్వహించగా, చెత్త నుంచి గ్రీనరీని పెంపొందించవచ్చనే విషయాన్ని లోగో ద్వారా తెలియజేసినందుకు గానూ అసోసియేషన్ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ హరివాక్ష్‌చోప్రా నుంచి బహుమతి అందుకున్నారు. కాటూరి మెడికల్ కళాశాలలో గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ కె.ఎస్.వరప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు, హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ చల్లా మోహన్‌రావు, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కె.శ్రీనివాసరెడ్డి, కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ ధూళిపాళ్ల ఫణీంద్ర తదితరులు డాక్టర్ డానియేల్‌ను అభినందించారు.

ఏఆర్టీ సేవలు మరింత చేరువ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మానాయక్

గుంటూరు మెడికల్: హెచ్ఐవీతో జీవిస్తూ ఏఆర్టీ మందులు వాడే వారికి లింక్ ఏఆర్టీ సెంటర్లలో మందులు అందిస్తున్నట్లు జిల్లా లెప్రసీ ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ లక్ష్మానాయక్ తెలిపారు. రోగులు 50 కిలోమీటర్ల పైబడి ప్రయాణం చేయడం వ్యయప్రయాసలతో కూడుకున్న దృష్ట్యా ప్రభుత్వం, రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు వారికి మరింత చెరువులో మందులు ఇవ్వాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. గుంటూరు సమగ్ర వైద్యశాల ఏఆర్టీ ప్లస్‌లో గురువారం నిర్వహించిన కో–ఆర్డినేషన్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏఆర్టీ సిబ్బంది, స్వచ్ఛంద సేవ సంస్థలు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్ట్ మేనేజర్ లంకపల్లి మధుసూదనరావు మాట్లాడుతూ హెపటైటిస్ బీ గురించి అవగాహన కల్పించడంతో పాటు హెచ్ఐవీతో జీవిస్తున్న వారందరికీ వ్యాక్సిన్ అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఐసీటీసీ సూపర్‌వైజర్ జ్యోతుల వీరాస్వామి, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రభాకరరావు, షేర్ ఇండియా ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.రత్న కుమార్, ఏఆర్టీ మెడికల్ ఆఫీసర్లు, ఐసీటీసీ సిబ్బంది, వైఆర్‌జీ కేర్, విహాన్, వీహెచ్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

వెట్టి చాకిరి నిర్మూలన వారోత్సవాలు ప్రారంభం



న్యాయ విజ్ఞాన బస్సును ప్రారంభిస్తున్న అధికారులు

నగరంపాలెం: జిల్లా ఏహెచ్‌టీయూ ఆధ్వర్యంలో ఈనెల 9 నుంచి 15 వరకు చైల్డ్ లైన్, కార్మిక శాఖ, న్యాయ సేవాధికార సంస్థల సమన్వయంతో వెట్టి చాకిరీ నిర్మూలన వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు గురువారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు బస్సును ప్రారంభించారు. ప్రతి వ్యక్తీ రాజ్యాంగం కల్పించిన హక్కులకు అర్హుడని, ఎవరికి ఎవర్ని నిర్బంధించి పని చేయించుకునే అధికారం లేదని వక్తలు పేర్కొన్నారు. ఒకవేళ ఎవరైనా అలా చేస్తే చట్టపరంగా శిక్షార్హులని తెలిపారు. వెట్టిచాకిరి చేస్తున్న పిల్లల్ని విడిపించి వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దడమే అందరి లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు వెట్టిచాకిరి వ్యవస్థ నిర్మూలనకు ముందుకురావాలని అధికార, సిబ్బంది, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏహెచ్‌టీయూ మానవ అక్రమ రవాణా నివారణ విభాగం అధికారి బెల్లం శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ సీఐ బాలసుబ్రహ్మణ్యం, చైల్డ్ లైన్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ విభాగం, కార్మిక శాఖ ఇతరత్రా విభాగాల అధికార సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రెడ్డి జనాభ్యుదయ మండలి ఆధ్వర్యంలో పలువురికి సన్మానం



నెహ్రూనగర్: రెడ్డి జనాభ్యుదయ మండలి(రెడ్డి హాస్టల్) ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో రాణించిన వారికి గురువారం రాత్రి ఘనంగా సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ విశ్వ విద్యాలయాల బోధనేతర సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన యేటిగడ్డ వెంకటప్పారెడ్డి, చిల్లీస్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన లేళ్ల పెద అప్పిరెడ్డికి, ఆసియా వేద సంస్కృతి పరిశోధన విశ్వవిద్యాలయం హోసూరు, కర్ణాటక రాష్ట్రం నుంచి గౌరవ డాక్టరేట్లు పొందిన భవనం వెంకటరెడ్డి(సేవ) శ్యామల వెంకటరెడ్డి(కళలు, సాహిత్యం)లను మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో హాస్టల్ గౌరవ అధ్యక్షుడు మోదుగుల పాపిరెడ్డి, అధ్యక్షుడు చల్లా అంజిరెడ్డి, ఉపాధ్యక్షుడు వీసీఆర్ రెడ్డి, సెక్రటరీ కంది సంజీవరెడ్డి, జాయింట్ సెక్రటరీ సూరసాని వెంకటరెడ్డి, మేనేజర్ జంగా సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

జీవ వైవిధ్యంపై కొత్త ఆలోచనలకు సదస్సు దోహదం

వీసీ ఆచార్య పి రాజశేఖర్



సదస్సును ప్రారంభిస్తున్న వీసీ

ఏఎన్‌యూ: జీవ వైవిధ్యంపై కొత్త ఆలోచనల ఆవిష్కరణకు, నేడు మనిషి ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి జాతీయ సదస్సు దోహదం చేస్తుందని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ తెలిపారు. నాగార్జున యూనివర్సిటీ జువాలజీ విభాగం ఆధ్వర్యంలో 'ఇమ్యునాలజీ, ఆక్వాటిక్ టాక్సికాలజీ అండ్ బయోడైవర్సిటీ' అనే అంశంపై నిర్వహిస్తున్న జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. సభకు హాజరైన వీసీ ప్రసంగిస్తూ సదస్సులో వక్తలు చెప్పే అంశాల్ని తమ పాఠ్యాంశాలకు జోడించి పరిశోధకులు, విద్యార్థులు కొత్త ఆలోచనలు చేయాలని సూచించారు. గౌరవ అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ బి. కరుణ మాట్లాడుతూ సదస్సులో చర్చించే అంశాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. సదస్సు సమన్వయకర్త కె. సునీత మాట్లాడుతూ రెండు రోజులపాటు జరిగే ఈ జాతీయ సదస్సులో దేశవ్యాప్తంగా పలు యూనివర్సిటీలు, పరిశోధన సంస్థల నుంచి జువాలజీ, బయోడైవర్సిటీ రంగ నిపుణులు హాజరై పలు అంశాలపై ప్రసంగించి పరిశోధన పత్రాలు సమర్పిస్తున్నారని తెలిపారు. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ శిష్లా రామకృష్ణ కీలకోపన్యాసం చేస్తూ కోవిడ్–19 బారినపడిన వారు వాడిన అనేక మందుల వల్ల తలెత్తే దుష్పరిణామాలు అధిగమించడంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని సూచించారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ అధ్యాపకులు పి. అనిల్, కె. శ్రీకాంత్, విజ్ఞాన్ విశ్వవిద్యాలయం అధ్యాపకులు ఎస్.ఎస్. సంపత్ కుమార్, సీహెచ్. అంజనీదేవి, సెంటర్ ఫర్ కంప్యూటేషనల్ అండ్ బయలాజికల్ సైన్సెస్ ప్రతినిధి పి.జాన్ ప్రసంగించారు. ఏఎన్‌యూ జువాలజీ, ఆక్వా కల్చర్ విభాగ అధ్యాపకులు పి.వి. కృష్ణ, సింహాచలం, పద్మావతి, సుమంత్ కుమార్, జగదీష్ నాయక్, గోపాలరావు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్‌కు అభినందన

యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ ఎం. దేదీప్యను గురువారం వీసీ అభినందించారు. ఆమె జనవరి 1 నుంచి 31వ తేదీ వరకు ఢిల్లీలో జరిగిన ఎన్ఎస్ఎస్ రిపబ్లిక్ డే పేరేడ్ శిబిరంలో, భారత సైన్యంతో కలసి నిర్వహించిన కవాతులో పాల్గొంది. యూనివర్సిటీకి చేరుకున్న ఆమెను వీసీ అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి. కరుణ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రమీలారాణి, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ ఎం. రవిశేఖర్, అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ డి. రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎన్‌జీతో కాలుష్య నియంత్రణ

ఐఓసీఎల్ ఈడీ సంజయ్‌కుమార్



కారులో సీఎన్‌జీ నింపుతున్న సంజయ్‌కుమార్

పాత గుంటూరు: సీఎన్‌జీ (కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్) వాహనాలను వినియోగించడం ద్వారా కాలుష్యాన్ని నియంత్రించవచ్చని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.సంజయ్‌కుమార్ తెలిపారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని పొన్నూరు రోడ్డు, హైవేలోని ఐఓసీఎల్ పెట్రోలు బంకుల్లో గురువారం సీఎన్‌జీ పరికరాల్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎన్‌జీ వాడకం వల్ల కాలుష్య నియంత్రణతో పాటు, డీజిల్, పెట్రోలు కన్నా వ్యయం తగ్గుతుందని తెలిపారు. పెట్రోలు కంటే 40 శాతం అధికంగా మైలేజీ అందిస్తుందని చెప్పారు. రానున్న కాలంలో నివాసాలకు పైపులైను ద్వారా గ్యాస్ అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఢిల్లీ ఈడీ సంజయ్‌కుమార్ ఝా, ఆంధ్ర, తెలంగాణ ఈడీ బి. అనిల్ కుమార్, ఐఓసీఎల్ గుంటూరు ఇన్‌చార్జి జె. అనిల్ కుమార్, పెట్రోలు బంకుల డీలర్లు, వాహనదారులు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రమాదాల నుంచి రక్షణ



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌హెచ్‌ఓ సుబ్బారావు, సిబ్బంది

గుంటూరు ఈస్ట్: హెల్మెట్ ఉపయోగంపై మణి హోటల్ సెంటర్‌లో గురువారం పాత గుంటూరు ఎస్‌హెచ్‌ఓ సుబ్బారావు వాహనచోదకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులంతా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రమాద సమయంలో ఎక్కువగా తలకు బలమైన గాయాలయ్యే అవకాశం ఉందని, హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాపాయం నుంచి బయట పడవచ్చని తెలిపారు. వాహనదారులు తన కుటుంబ సభ్యుల్ని గుర్తు పెట్టుకుని తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు. ట్రాఫిక్ నిబంధనల్ని ప్రతి ఒక్కరూ పాటించాలని, దీని వల్ల ప్రమాదాలు తగ్గుతాయని చెప్పారు.